క్లుప్తంగా

రేపటి నుంచి పశు వైద్య శిబిరాలు


వంశీ, పశువైద్యాధికారి

చంద్రగిరి : మండలంలో సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు నారావారిపల్లె పశువైద్యాధికారి డాక్టర్ వంశీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మూడు బృందాలతో కలిసి 10 రోజుల పాటు శిబిరాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సోమవారం మామిడిమానుగడ్డ, మల్లయ్యపల్లె, పనపాకం, 21న గంగుడుపల్లె, కల్‌రోడ్డుపల్లె కొండ్రెడ్డికండ్రిగ, 22న భీమవరం, ముంగళిపట్టు, 23న ఐతేపల్లె, కందులవారిపల్లె, 24న తొండవాడ, శేషాపురం, 25న ఏజీపల్లె, శానంబట్ల, 27న ఏ.రంగంపేట, మామండూరు, 28న నరసింగాపురం, కొటాల, 29న రామిరెడ్డిపల్లె, 30న బుచ్చినాయుడుపల్లె, 31వ తేదీన మటంపల్లె, చంద్రగిరి కోట, మూలపల్లె శిబిరాలు ఉంటాయని వివరించారు.

కుష్టు రోగుల గుర్తింపునకు సర్వే


మాట్లాడుతున్న అధికారులు

చంద్రగిరి : మండలంలోని కుష్టు రోగుల గుర్తింపునకు ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అధికారి డాక్టర్ రాజకుమార్ స్పష్టం చేశారు. శనివారం ఈ మేరకు ఆయన కొటాల పీహెచ్‌సీలో సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాజకుమార్ మాట్లాడుతూ సోమవారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని వెల్లడించారు.శరీరంపై నొప్పిలేని బుడిపెలు, ముక్కు అణిగి ఉండడం, స్పర్శ, నొప్పిలేని రాగివర్ణంలో మచ్చలు ఉంటే కుష్టు నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశించారు. డీపీఎంఓ ముని సుబ్బ రామిరెడ్డి మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో రోగులను గుర్తించి వారికి వైద్యం అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ ఈశ్వరయ్య, సూపర్‌వైజర్ లలిత పాల్గొన్నారు.

కాపునాడు జిల్లా అధ్యక్షుడిగా మల్లికార్జున


మల్లికార్జునకు నియామక పత్రం అందిస్తున్న కాపునాడు ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా కాపునాడు అధ్యక్షుడిగా పెమ్మా మల్లికార్జునను నియమించినట్లు సంఘం జాతీయ అధ్యక్షుడు మల్లెల శివ నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కాపుల సంక్షేమమే లక్ష్యంగా కాపునాడు ఏర్పాటు చేశామన్నారు. తమ సేవలను మరింత విస్తృతం చేసే సంకల్పంతో మల్లికార్జునను జిల్లా అధ్యక్షుడుగా ఎంపిక చేశామని వెల్లడించారు. అనంతరం నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాపునాడు జాతీయ ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'బీపీఎస్'కు మరో అవకాశం

తిరుపతి తుడా : బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్(బీపీఎస్), ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) సవరణకు మరో అవకాశం కల్పించినట్లు కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ 2019కి ముందు బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌లను అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అనధికారిక నిర్మాణాలను క్రమబద్ధీకరించుకునే వెసులుబాటు ఇచ్చిందని వెల్లడించారు. ఈ క్రమంలో 167 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వారు అన్ని పత్రాలను సమర్పించి క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చిందని వివరించారు. గతంలో దరఖాస్తు చేసుకుని, షార్ట్‌ఫాల్స్‌లో ఉన్న వాటికి మాత్రమే ఇది వర్తిస్తుందని తెలిపారు. సోమవారం నుంచి డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని పునరుద్ధరించనున్నట్లు చెప్పారు. 0877- 2227208 నంబర్‌కు ఉదయం 9.30 నుంచి 10:30 గంటల మధ్య ప్రజలు కాల్ చేయవచ్చని వెల్లడించారు.

తిరుచ్చిపై వెంకన్న విహారం


ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా వేకువనే స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. అనంతరం దేవదేవేరు కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ జరిపించారు. రాత్రి శ్రీవారు ఉభయ దేవేరీ సమేతంగా తిరుచ్చిపై కొలువుదీరి మాడవీధుల్లో విహరించారు. కార్యక్రమంలో ఏఈఓ గోపీనాథ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్ పాల్గొన్నారు.


పఠనం.. మేధో పయనం



సమాజానికి దిశానిర్దేశం చేసే మహత్తర శక్తి పుస్తకం.. సుషుప్తావస్థలోని ప్రపంచాన్ని మేల్కొలిపే అద్భుత సాధనం.. జాతిని జాగృత పరచే మహిమాన్విత ఆయుధం.. పుస్తక పఠనంతోనే ఉత్తమ భవిత సాధ్యం. అయితే నేటి ఆధునిక కాలంలో యువతకు పఠనాసక్తి తగ్గిపోతోంది. సాంకేతిక పరిజ్ఞాన కొత్తపుంతలు తొక్కుతున్న నేపథ్యంలో సెల్‌ఫోన్ వాడకం పెరిగిపోయింది. ప్రధానంగా చదివే ఓపిక నశిస్తోంది. ఈ క్రమంలో సామాజిక అంశాలపై అవగాహన లోపిస్తోంది. ఫలితంగా విద్యార్థి దశలోనే మానసిక ఒత్తిడి వేధిస్తోంది. శారీరక రుగ్మతలతో ఆరోగ్యం దెబ్బతింటోంది. ఈ మేరకు ప్రతి ఒక్కరూ విశేష పుస్తకాల అధ్యయనంపై ఆసక్తిని పెంపొందించుకోవాలని మేధావులు సూచిస్తున్నారు. చిన్న వయసు నుంచే అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరుచుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని వెల్లడిస్తున్నారు. పాఠశాల విద్యతోపాటు విశిష్ట గ్రంథాలను ఔపోసన పడితే అత్యుత్తమంగా రాణించవచ్చని పలువురు యువ రచయితలు మార్గనిర్దేశం చేస్తున్నారు.

– తిరుపతి సిటీ

- పుస్తకాలతో భవితకు దిశానిర్దేశం
- అధ్యయనంతో అనంత జ్ఞానం
- అలవాటుగా మార్చుకుంటే జీవితమే నందనం
- పఠనాసక్తే రచనలకు కీలకమంటున్న యువ రచయితలు





దివ్యౌషధం



యువతలో ఏకాగ్రత, సహనం, జ్ఞాపకశక్తి, మంచి ఆరోగ్యాన్ని అందించే ఏకైక దివ్యౌషధం పుస్తకం మాత్రమే. విద్యార్థులు సాంకేతికతకు పునాది అయిన పుస్తక పఠనం వైపు మొగ్గు చూపాలి. సాధారణ కుటుంబం నుంచి వచ్చా. తెలుగులో పీహెచ్‌డీ చేస్తూ ఎన్నో గ్రంథాలకు సమీక్షకునిగా పనిచేశా. సాధారణ వ్యక్తిని మహోన్నత వ్యక్తిగా తీర్చిదిద్దగల శక్తి పుస్తకాలకుంది. కవితలు, రచనలపై యువత ఆసక్తి పెంచుకోవాలి. సెల్‌ఫోన్ అలవాటు నుంచి బయటపడినప్పుడే ఇది సాధ్యమవుతుంది. ఆ వ్యసనం నుంచి బయట పడి యువత పుస్తక పఠనం వైపు దృష్టి పెట్టాలంటే లక్ష్యం ఉన్నతంగా ఉండాలి. – గరికపాటి రమేష్ బాబు, పరిశోధక విద్యార్థి, తిరుపతి

పుస్తకాలే నేస్తాలు



మాది బీఎన్ కండ్రిగ, సాధారణ వ్యవసాయ కుటుంబం. పీజీ, బీఈడీ పూర్తి చేశా. పేరొందిన కవులు, రచయితల పుస్తకాలను ఇంటర్ నుంచి చదవడం మొదలెట్టా. వాటి ప్రభావం నాపై పడింది. సమాజంలోని సమస్యలను ఎత్తి చూపాలనే తపన నాలో బలంగా నాటుకుపోయింది. ప్రభుత్వ టీచర్‌గా ఎంపికైనా పుస్తకాలపై ఆపేక్ష తగ్గలేదు. మానవీయ విలువలు, కుటుంబ బాంధవ్యాలు, అట్టడుగు ప్రజల అభ్యున్నతిని అక్షర రూపంలో 'మట్టి అద్దం' పేరుతో పుస్తకం రాశా. ఎంతో మంది ప్రముఖ కవులు, రచయితల అభినందనలు పొందా. పలు పురస్కారాలు అందుకున్నాను. పాఠశాల పిల్లలతో బాల నేస్తాలు పేరుతో పుస్తకం రాయించడం మరవలేనిది. నేటి యువతరం పుస్తక పఠనాన్ని దినచర్యలో భాగం చేసుకుంటే లక్ష్య సాధన సులభతరమవుతుంది.

– యువశ్రీ మురళి, రచయిత, తిరుపతి

వెతలే నా కథలు



మాది ప్రకాశం జిల్లా కందుకూరు. నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబం నుంచి వచ్చా. డిగ్రీ, బీఈడీ పూర్తి చేశా. ప్రస్తుతం ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నా. పరుగులు తీస్తున్న ఆధునిక సమాజంలో బాంధవ్యాలు, మానవత్వం, విలువలు ప్రశ్నార్థకమవుతున్నాయి. యువత టెక్నాలజీ పేరుతో సెల్‌ఫోన్లలో మునిగిపోవడం వంటివి నాపై ప్రభావాన్ని చూపాయి. భూమిపై జీవనం కష్ట సాధ్యమైందని గుర్తించి, పలు అంశాలను కవితల రూపంలో 'ఆకాశ దేశం' పేరుతో పుస్తకం రాశా. పలు ప్రశంసలు అందుకున్నా. పుస్తక పఠనం మనిషికి ఆనందం అందిస్తుంది. ప్రపంచాన్ని జయించినంత బలం ఇస్తుంది. సమాజాన్ని మేల్కొల్పేందుకు దోహదపడుతుంది.

– యుగళగీత్ నామతోటి రవితేజ, రచయిత, తిరుపతి

యువతకు మార్గదర్శి



ప్రకాశం జిల్లా సింగరాయకొండ మా స్వస్థలం. సంస్కృత వర్సిటీలో పీజీ పీహెచ్‌డీ పూర్తి చేశా. అక్కడే అధ్యాపకునిగా పనిచేస్తున్నా. సామాజిక అంశాలతో పాటు పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే పదకవిత్వంతో పాటు వ్యక్తిత్వ వికాసానికి సాహిత్యం బలమైన సాధనం అనే కోణంలో 'సాంప్రదాయ సుగంధం' అనే పుస్తకాన్ని రచించాను. ఎన్నో అవార్డులు, ప్రశంసలు అందుకున్నా. సెల్‌ఫోన్ జీవితంలో అవసర వస్తువు మాత్రమే. జీవితం కాదు. పుస్తకం యువతకు మార్గదర్శిగా అందమైన జీవితాన్ని అందిస్తుంది. నేటి యువత పుస్తక పఠనంపై మొగ్గు చూపితే అత్యున్నత శిఖరాలను అధిరోహించవచ్చు. దేశానికి, మనిషి జీవితానికి దిశానిర్దేశం చేసేది పుస్తక పఠనం. ప్రముఖులు రాసిన పుస్తకాలు లక్షల కొద్దీ అందుబాటులో ఉన్నా యువత పఠనంపై ఆసక్తి చూపకపోవడం భారతావనికి ప్రమాదమే.

– డాక్టర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ, రచయిత, తిరుపతి

అందమైన ప్రపంచం



మాది శ్రీకాకుళం, లావేరి మండలం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో జాతీయ సంస్కృత వర్సిటీలో పీహెచ్‌డీ చేస్తు. ఆరో తరగతి చదివే రోజుల్లో గురువులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచారు. అందులో జీవిత లక్ష్యంతో పాటు సమాజంలో మానవుల పాత్ర ఏమిటో తెలియజేస్తాయనే విషయాన్ని గుర్తించా. జ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనం తప్ప వేరే మార్గం లేదని గ్రహించా. నిత్యం ప్రముఖ కవుల రచనలను చదవడం అలవాటు చేసుకున్నా. మానసిక ఒత్తిడితో పాటు మేధోశక్తికి పుస్తకం టానిక్ లాంటిది. 'ఎందుకో తెలియని కంగారు', 'నీ కోసం' అనే కవితలు నాకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే మరో అందమైన ప్రపంచాన్ని చూడవచ్చు.

– పిల్లా పుణ్యవతి, పరిశోధక విద్యార్థిని, తిరుపతి

రీ సర్వేపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఆర్‌డీఓ రామ్మోహన్

భాకరాపేట : భూముల రీసర్వేపై రైతులకు అవగాహన అవసరమని ఆర్‌డీఓ రామ్మోహన్ తెలిపారు. శనివారం భాకరాపేట సచివాలయ వద్ద రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ సుమారు 120 ఏళ్లుగా రీసర్వే జరగక పోవడంతో భూసమస్యలు తలెత్తుతున్నాయన్నారు. రీ సర్వేతో చాలా సమస్యలు పరిష్కారమవుతాయని వెల్లడించారు. సర్వే అనంతరం భూములకు ఎల్‌పీఎం నంబర్లు జారీ చేస్తామని వివరించారు. ఈ క్రమంలోనే. భాకరాపేటను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని తెలిపారు. ఇక్కడ 1768.56 ఎకరాల విస్తీర్ణం ఉందన్నారు. సర్వే కోసం 4 టీములు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జనార్దన్‌రాజు, సర్పంచ్ సాకిరి భూపాల్, రీసర్వే ఇన్‌స్పెక్టర్ కృపాకర్, డీటీ వాసుదేవకుమార్, ఆర్‌ఐ జానకిరామ్, సర్వేయర్లు గణేష్, కేశవులు, రహంతుల్లా, సాధిక్, నవీన్, చంద్ర, నాగేంద్ర, భవ్య, మనోహర్, హేమంత్, చక్రపాణి, వీఆర్‌ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం


త్యాగయ్యకు అంజలి ఘటిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి కల్చరల్ : ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో శనివారం సద్గురు శ్రీత్యాగరాజస్వామి వారి 178వ పుష్యబహుళ పంచమి ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ప్రిన్సిపల్ ఉమా ముద్దుబాల మాట్లాడుతూ త్యాగరాజస్వామిగా పేరు గాంచిన కాకర్ల త్యాగరాజు సుమారు 250 ఏళ్ల క్రితం తమిళనాడులోని తిరువైయ్యారు గ్రామంలో వైశాఖ శుద్ధ షష్టి నాడు జన్మించారని తెలిపారు. వారి పూర్వీకులు ఆంధ్రప్రదేశ్‌లోని కాకర్ల గ్రామానికి చెందిన వారని వెల్లడించారు. ఆయన 24 వేల కీర్తనలు రచించినప్పటికీ కేవలం 736 కీర్తనలు మాత్రమే లభించాయని వివరించారు.

'స్వచ్ఛత'.. అందరి బాధ్యత


పాకాల : ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది


మల్లంగుంటలో డస్ట్‌బిన్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ రామచంద్ర

తిరుపతి తుడా : నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. స్వచ్ఛత అందరి బాధ్యతని పిలుపునిచ్చారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ దివస్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఏప్రిల్‌లోపు ఇంటింటి చెత్త సేకరణను వందశాతం చేపట్టేలా లక్ష్యం నిర్దేశించినట్లు చెప్పారు. అక్టోబర్‌లోపు చెత్తకుప్పలు లేని నగరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. క్లీన్ స్టార్ట్ అనే థీమ్‌లో మన ఇల్లు, మన ఆఫీస్, సచివాలయాలు, బస్టాండ్లు, పరిసరాలను శుభ్రం చేయాలని, ఇందులో ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రకాశం పార్కులో చెత్త తొలగించి, మానవహారం ఏర్పాటు చేశామన్నారు. శెట్టిపల్లి వద్దచెత్త కుప్పలను తొలగించి మొక్కలు నాటామని తెలిపారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్‌ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు. ఈ క్రమంలోనే తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ మౌర్య స్వయంగా చీపురు పట్టి అధికారులు, సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు.

పాకాల : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈఓపీఆర్డీ శశిరేఖ తెలిపారు. శనివారం పాకాలలో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ నిర్వహించారు. సిబ్బందితో కలిసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి లావణ్య పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న కలెక్టర్, కమిషనర్

తిరుపతి రూరల్ : గ్రామాల్లో పచ్చదనం-పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని ఎంపీడీఓ రామచంద్ర తెలిపారు. మండలంలోని మల్లంగుంటలో స్వచ్ఛ దివస్ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఇంటింటికీ రెండు డస్ట్ బిన్‌లు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

వారు వెళ్లారు... వీరు ఇంటిని దోచుకెళ్లారు


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న చంద్రగిరి డీఎస్పీ బేతపూడి ప్రసాద్, సీఐ చిన్నగోవిందు

తిరుపతి రూరల్: సంక్రాంతికి కుటుంబంతో కలిసి అందరూ పండక్కి ఊరు వెళ్లారు. అర్ధరాత్రి ఎంచక్కా దొంగలు ఇంటి తలుపు పగులకొట్టి దొరికిన కాడికి బంగారు నగలు, నగదు తీసుకెళ్లిన ఘటన తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం, సాయినగర్ టెలిఫోన్ కాలనీలో బోనం సురేఖ దంపతులు నివాసం ఉంటున్నారు. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 12న కుటుంబంతో కలిసి స్వగ్రామం బోనంవారిపల్లికి వెళ్లారు. ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నట్లు గుర్తించి 17వ తేదీ సాయంత్రం అదే భవనంలో అద్దెకు ఉండేవారు సురేఖకు సమాచారం అందించారు. శనివారం ఉదయం వచ్చిన సురేఖ ఇంటిని పరిశీలించారు. చోరీ జరిగినట్లు గుర్తించారు. బీరువాలోని 74 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.17 వేల నగదు దొంగతనం జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. చంద్రగిరి డీఎస్పీ బేతపూడి ప్రసాద్, రూరల్ సీఐ చిన్నగోవిందు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఔషధ ప్రక్రియలో 'ఏఐ' కీలకం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్, వైద్యులు

తిరుపతి తుడా : డ్రగ్స్ డిస్కవరీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రధాన పాత్ర పోషిస్తోందని స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ వెల్లడించారు. స్విమ్స్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో 'రోల్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ డ్రగ్స్ డిస్కవరీ' అనే అంశంపై పద్మావతి ఆడిటోరియంలో శనివారం అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది డిజైన్ నుంచి క్లినికల్ ట్రయల్స్ వరకు, అలాగే డ్రగ్ గుర్తించడంలో పరిశోధకులకు సహాయ పడుతుందన్నారు. ఖర్చులను తగ్గించడం, కొత్త ఔషధాలను మెరుగు పరచడంలో ఏఐ సహాయ పడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో కెనడాకు చెందిన ఉటావా యూనివర్సిటీ సైంటిస్ట్ డాక్టర్ రాహుల్ రవిచంద్రన్, స్విమ్స్ డీన్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఉమామహేశ్వరి, మెడిసిన్ విభాగాధిపతి డా.నాగరాజు, డెంటిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ మధుబాబు, వైద్యులు డాక్టర్ భార్గవ్, విభాగాధిపతులు, వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో ఎన్టీఆర్‌కు నివాళి


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, సిబ్బంది


పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి సిటీ : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు 29వ వర్ధంతి సందర్భంగా శనివారం వర్సిటీలోని ఆయన విగ్రహానికి వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రత్యేక వర్సిటీని తిరుపతిలో ఏర్పాటు చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు.

పాకాల : ఆర్టీసీ బస్‌స్టాండ్ వద్ద మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే పులివర్తి నాని నివాళులర్పించారు.

ఎక్స్‌ప్రెస్‌లు సర్వీస్ రోడ్డుకు రావాలని డిమాండ్

పాకాల : హైవేలో ప్రయాణించే అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులు నేంద్రగుంట వద్ద సర్వీస్ రోడ్డులోకి రావాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత డిమాండ్ చేశారు. శనివారం ఆమె మాట్లాడుతూ చిత్తూరు-తిరుపతి బస్సులు బ్రిడ్జిపై వెళ్లిపోతున్నాయని, నేంద్రగుంట వద్ద దిగే ప్రయాణికులు ఉంటేనే సర్వీసు రోడ్డులోకి వస్తున్నాయని ఆరోపించారు. దీంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు నేంద్రగుంట సర్వీసు రోడ్డులోని బస్‌స్టాప్ వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలిచేలా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

ముగిసిన వైకుంఠ ద్వార దర్శనం

తిరుమల : తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం నిర్ణీత సమయంలో జరుగుతోంది. శనివారంతో వైకుంఠ ద్వార దర్శనం ముగిసింది. శుక్రవారం తిరుమల శ్రీవారిని 61,142 మంది దర్శించుకోగా 19,736 మంది తలనీలాలు సమర్పించారు. అదేవిధంగా శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.15 కోట్లు వచ్చాయి. వైకుంఠ ద్వార దర్శనం టికెట్లు కలిగిన భక్తులను మాత్రమే అనుమతిస్తున్నారు. టికెట్ లేని భక్తులకు దర్శనం లేదు.

ఆగని చేపల వేట

- మంగళం చెరువులో మత్స్య దోపిడీ
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- రూ.లక్షల ఆదాయానికి గండి
- మండిపడుతున్న గ్రామస్తులు


మంగళం చెరువులో చేపలు పడుతున్న దృశ్యం

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికారులు అన్ని నిబంధనలను తుంగలో తొక్కేస్తున్నారు. అందులో భాగంగానే మంగళం పంచాయతీలోని మంగళం చెరువులో అక్రమంగా సాగుతున్న చేపల వేటను చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ చెరువలో చేపల వేట వేలం గడువు ముగిసి ఆరు నెలలు అవుతున్నా, పాత కాంట్రాక్టరే కొమ్ముకాస్తున్నారు. గత వేలందారుడు గంగాధరం ఇప్పటికీ ఎలాంటి నగదు చెల్లించకుండా ఇష్టానుసారం చేపలను పట్టుకుని విక్రయిస్తున్నాడు. అదేమని గ్రామస్తులు ప్రశ్నిస్తే రెన్యూవల్‌కు అర్జీ పెట్టుకున్నామని ఎదురుదాడి చేస్తున్నాడు. కలెక్టర్ నుంచి అనుమతులు రాకపోయినా ఎమ్మెల్యే పులివర్తి నాని పేరు చెప్పుకుంటూ యథేచ్ఛగా చేపలను పట్టేసి.. అమ్మేస్తున్నాడు. ఈ విషయంలో పంచాయతీ అధికారులకు ముడుపులు ముట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది వరకు మంగళం చెరువును రూ. 9.50లక్షలకు వేలం వేశారు. ఇప్పుడు వేలం నిర్వహిస్తే రెట్టింపు ఆదాయం పంచాయతీకి వచ్చే అవకాశముంది. అయినా అధికారులు వేలం నిర్వహించకుండా గంగాధరానికేతిరిగి కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై పంచాయతీ అధికారిని వివరణ అడగగా మంగళం చెరువు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెబుతున్నారు. ఏది ఏమైనా వారి నిర్లక్ష్యం కారణంగా రూ.లక్షల్లో పంచాయతీ ఆదాయానికి గండిపడుతోంది.

వేలం నిర్వహించాలి

జిల్లా పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని మంగళం చెరువుకు వేలం నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో వేలం దక్కించుకున్న వారికే కట్టబెట్టకుండా తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఇది వరకటి కంటే రెట్టింపు రేటుకు వేలం పాడుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడిస్తున్నారు.